సాక్షి
అనంతపురం
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



రేపు 'స్పందన' ఉండదు

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో 'స్పందన' రద్దు చేసినట్లు డీఆర్వో గాయత్రీదేవి తెలిపారు.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4.50, సరాసరి రూ.7 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/22.6°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రజారోగ్యానికి రక్ష



విలేకరులతో మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేదలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నార న్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమైనదన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టార న్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రాజారాం, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల కమిటీ నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ల విభాగం కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన డాక్టర్ సయ్యద్ ఇంతియాజ్ అహమ్మద్ నియమితులయ్యారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా బోగె హరీష్‌కుమార్ రెడ్డి(రాప్తాడు), ఉపాధ్యక్షుడిగా కె.సునీల్‌కుమార్(అనంతపురం అర్బన్), ప్రధాన కార్యదర్శులుగా కె.నాగరాజు(ఉరవకొండ), నాగేంద్రకుమార్(గుంతకల్లు), బి.మల్లికార్జున(రాయదుర్గం), చంద్రశేఖర్‌రెడ్డి(అనంతపురం అర్బన్), కార్యదర్శులుగా నవాజ్, చంద్రకాంతరెడ్డి (ఉరవకొండ), గుడికటి మహేష్ (గుంతకల్లు), వేణుగోపాలరెడ్డి(శింగనమల), ములకలేడు సంధ్యారాణి (కళ్యాణదుర్గం), టి.రఫి(అనంతపురం అర్బన్), సహాయ కార్యదర్శులుగా షేక్ షబానా, మస్తానయ్య(గుంతకల్లు), మహంతపురం ఈరన్న(కళ్యాణదుర్గం), ఎర్రిస్వామి, రంగ (ఉరవకొండ), రఫీక్, నయీం బాషా (రాయదుర్గం), ఎస్ నౌషాద్, సీ శ్రీనివాసరెడ్డి(అనంతపురం అర్బన్) నియమితులయ్యారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు ప్రారంభం
- 34 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా వైద్య సేవలు
- తరలివచ్చిన ప్రజలు.. వైద్య సేవల తీరుపై హర్షం
- నవంబర్ 24 వరకు కొనసాగనున్న వైద్య శిబిరాలు
- కార్యక్రమం నిర్వహణపై స్టేట్ అబ్జర్వర్ అరుణ్‌కుమార్ ప్రశంసలు



కళ్యాణదుర్గం మండలం గరుడాపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరంలో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



నార్పల మండలం నాయనిపల్లిలో వైద్య చికిత్స చేయించుకున్న రోగితో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ అరుణ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ గౌతమి

అనంతపురం మెడికల్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రభుత్వాస్పత్రులను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన వైద్యసేవలందిస్తోంది. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యమందిస్తోంది. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరిట ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకొచ్చింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లాలోని 34 ప్రాంతాల్లో (అర్బన్ 28, రూరల్ 6) వైద్య శిబిరాలు నిర్వహించారు. సెప్టెంబర్ 15 నుంచి జిల్లాలోని ప్రతి ఇంటినీ ఆరోగ్యశాఖ సిబ్బంది సందర్శించి సర్వే చేశారు. 388 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో 5,26,679 మందికి బీపీ, హెచ్‌బీ, యూరిన్, మలేరియా, డెంగీ, గళ్ల, తదితర పరీక్షలు నిర్వహించారు. అందులో సమస్యలున్న వారిని గుర్తించి చికిత్స కోసం వైద్య శిబిరాలకు తీసుకొచ్చారు. వీరికి గైనిక్, ఫిజీషియన్, కంటి వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు స్క్రీనింగ్ చేసి ఆరోగ్య పరిస్థితి బట్టి వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. తొలిరోజు క్యాంపుల్లో 136 మంది వైద్యులు, వందల సంఖ్యలో కింది స్థాయి సిబ్బందితో పాటు 68 మంది స్పెషలిస్టు వైద్యులు (గైనకాలజిస్టులు, ఫిజీషియన్లు, ఆప్తాల్మాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు) సేవలందించారు. జిల్లాలో కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్ గార్గ్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బాగా నిర్వహిస్తున్నారని స్టేట్ అబ్జర్వర్ అరుణ్‌కుమార్ ప్రశంసించారు.

చెంతనే వైద్యం.. అద్భుతం



గతంలో ఏ ప్రభుత్వాలు ఇలా ఇళ్ల వద్దకు వచ్చి పరీక్షలు చేసి ఆస్పత్రులకు తీసుకొచ్చిన దాఖలాలు చూడలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మనసుతో మాలాంటి వృద్ధులకు మంచి వైద్య సదుపాయాలను కల్పించారు. పెద్దాస్పత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలంటే ఆటో, ఇతర వాహనాల్లో వెళ్లి గంటల తరబడి క్యూలో నిలుచుని ఇబ్బంది పడేవాళ్లం. అటువంటిది ఇంటి సమీపంలోనే క్యాంపులు నిర్వహించి సేవలందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– సుబ్బన్న, బుడ్డప్పనగర్, అనంతపురం

జగనన్న మేలు మరువలేం



ప్రైవేట్‌గా ఏమైనా చికిత్స చేయించుకోవాలంటే కనీసం రూ.2వేలు ఖర్చు అవుతుంది. అటువంటి పరీక్షలను ఉచితంగా చేసి మంచి మందులు అందిస్తున్నారు. మాలాంటి వారికి పైసా ఖర్చు లేకుండా చూస్తున్నారు. జగనన్న మేలు మరువలేం.

– స్వప్న, గృహిణి, అనంతపురం

ఇదే స్ఫూర్తితో నవంబర్ 24వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని, కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండలం గరుడాపురంలో జరిగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.

- అనంతపురంలోని బుడ్డప్పనగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. పేదలు అనారోగ్యం బారినపడితే ఆర్థికంగా, మానసికంగా మరింత ఇబ్బంది పడతారని సీఎం వైఎస్ జగన్ భావించి.. వారిని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చూసేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టారని ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
- రాప్తాడు మండలం బొమ్మేపర్తి, నార్పల మండలం నాయనపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులను రాష్ట్ర అబ్జర్వర్ అరుణ్‌కుమార్, కలెక్టర్ గౌతమి పర్యవేక్షించారు.
- తాడిపత్రి ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రారంభించారు.
- గార్లదిన్నె మండలం శిరివరంలో జరిగిన కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శింగనమల సచివాలయం వద్ద జరిగిన శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.
- రాయదుర్గం పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి, గుంతకల్లులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని, గుత్తిలో మునిసిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పామిడి మండలం వంకరాజుకాలువలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉరవకొండ, వజ్రకరూరులో శిబిరాలను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు.

మెరుగైన వైద్యం కోసం 362 మంది గుర్తింపు

'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో 5,938 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి తెలిపారు. వీరిలో 362 మంది దీర్ఘకాలిక, గైనిక్, కంటి, తదితర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యానికి సిఫార్సు చేసినట్లు చెప్పారు. రెఫర్ చేసిన వారిని ఏఎన్‌ఎం సంబంధిత జిల్లా ఆస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.



పామిడి మండలం వంకరాజుకాల్వ వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



అనంతపురంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే అనంత, చిత్రంలో ఎంపీ రంగయ్య



గార్లదిన్నె మండలం శిరివరంలో వృద్ధుడికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



ఉరవకొండలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



తాడిపత్రి ఎంఈఓ కార్యాలయం వద్ద వృద్ధురాలికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయం

రాప్తాడు: ప్రజారోగ్యం కోసం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని స్టేట్ అబ్జర్వర్, జిల్లా స్పెషల్ ఆఫీసర్, సివిల్ సప్లయీస్ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' స్టేట్ అబ్జర్వర్ హెచ్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 34 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. నవంబర్ 24 వరకు ఈ క్యాంపులు కొనసాగుతాయన్నారు. ప్రతి గ్రామంలోనూ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పూర్తి పారదర్శకతతో అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య వివరాలు పక్కాగా నమోదు చేసి, ఎప్పుడు అవసరమైనా తెలుసుకునే విధంగా డిజిటల్‌గా నిక్షిప్తం చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరంలో హెల్ప్ డెస్క్, స్పాట్ సర్వీస్, కేస్ షీట్ సెంటర్, డాక్టర్ అలాట్మెంట్ డెస్క్, ఆరోగ్యశ్రీ రిఫరల్ కౌంటర్, మందులు పంపిణీ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, టేక్ హోమ్ రేషన్ వివరాలు, కంటి వెలుగు కౌంటర్ తదితర ఏర్పాట్ల గురించి కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఎస్‌ఓ శోభారాణి, డీపీఓ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కంటి వెలుగు నోడల్ ఆఫీసర్ కేశన్న, ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో పక్కాగా భూ హక్కు



భూముల రీసర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

- సర్వే చేసి హద్దురాళ్లు పాతి..
- సమగ్ర వివరాలతో భూహక్కు పత్రాలు

అనంతపురం అర్బన్: భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద రీ-సర్వే పకడ్బందీగా సాగుతోంది. జిల్లావ్యాప్తంగా 31 మండలాల పరిధిలో 503 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపట్టి ఉచితంగా హద్దురాళ్లు ఏర్పాటు చేసి కొత్త సర్వే నంబర్లు, ఖాతాతో యజమానులకు భూహక్కు పత్రాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటి వరకు సర్వే రెండు విడతలు జరిగింది. మొదటి విడతలో 43 గ్రామాలు, రెండో విడతలో 57 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. మూడో విడతలో 115 గ్రామాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభించారు. మొదటి, రెండు విడతల్లో సర్వే పూర్తిచేసిన 100 గ్రామాలకు సంబంధించి రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ ప్రక్రియను రెవెన్యూ యంత్రాంగం చేపట్టింది.

భూహక్కు పత్రాల పంపిణీ

మొదటి విడత సర్వే చేసిన 43 గ్రామాల పరిధిలో 23,858 ఖాతాలకు సంబంధించి భూ యజమానులకు భూ హక్కు పత్రాలను ఇప్పటికే పంపిణీ చేశారు. ఇక రెండవ విడతలో 57 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. ఇందులో 40 గ్రామాలకు సంబంధించి 18,239 ఖాతాలకు భూ హక్కు పత్రాలు ప్రభుత్వం నుంచి వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 12,529 మంది భూ యజమానులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేయడంతో పాటు ఈ-కేవైసీ పూర్తి చేశారు. మిగిలిన పత్రాల పంపిణీ, ఈ-కేవైసీ వారంలోపు పూర్తవుతుందని అధికారులు స్పష్టం చేశారు.

కచ్చితమైన హద్దులు వేశారు



నా పేరుపై 9.64 ఎకరాల భూమి ఉంది. అధికారులు మా భూమిని రీ-సర్వే చేశారు. భవిష్యత్తులో నా భూమి విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కచ్చితమైన హద్దులు నిర్ణయించారు. సమగ్ర వివరాలతో భూహక్కు పత్రం అందజేశారు. ప్రభుత్వం ఉచితంగా భూమి సర్వే చేసి పక్కాగా హద్దులు నిర్ధారించి మాకు ప్రయోజనం చేకూర్చడం సంతోషంగా ఉంది.

– నాగలక్ష్మి, తీటకల్లు, బ్రహ్మసముద్రం(మం)

భూహక్కు పత్రాల పంపిణీ

జిల్లాలో ఇప్పటి వరకు రెండు విడతల్లో 100 గ్రామల్లో రీ-సర్వే పూర్తి చేశాం. మొదటి విడతలో 43 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 23,858 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశాం. రెండవ విడతలో 57 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. ప్రస్తుతం 40 గ్రామాలకు సంబంధించి 18,239 మంది రైతులకు భూ హక్కు పత్రాలు వచ్చాయి. ఇప్పటి వరకు 12,529 మంది రైతులకు పత్రాలు అందజేసి ఈ-కేవేసీ చేశారు. పంపిణీ ప్రక్రియ వారంలోపు పూర్తవుతంది.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

3, 4 తేదీల్లో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ (సహిత విద్య) విభాగంలో ఖాళీగా ఉన్న రీసోర్స్ పర్సన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 3, 4 తేదీల్లో పరిశీలించనున్నట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) వి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంఆర్, హెచ్‌ఐ/వీఐ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లాకు చేరినట్లు తెలిపారు. ఎంఆర్ అభ్యర్థుల సర్టిఫికెట్లను 3న, హెచ్‌ఐ/వీఐ అభ్యర్థుల సర్టిఫికెట్లను 4న పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు అనంతపురంలోని సమగ్రశిక్ష కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లను రెండుసెట్లు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పాటు ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంఆర్ పోస్టులకు 144 మంది, వీఐ/హెచ్‌ఐ పోస్టులకు 120 దరఖాస్తులు వచ్చినట్లు ఏపీసీ తెలిపారు.

నేడు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల సమావేశం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జేసీఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లాలోని బియ్యం కార్డుదారులకు అక్టోబరు నెలకు సంబంధించిన రేషన్ ఆదివారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం ఇస్తారని, కిలో నుంచి మూడు కిలోల వరకు బియ్యం స్థానంలో రాగులను కూడా ఉచితంగానే తీసుకోవచ్చునని సూచించారు. అలాగే అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో గోధుమపిండి ఒక కిలో రూ.16 చొప్పున ఇస్తారని తెలిపారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి



అనంతపురం టవర్‌క్లాక్: నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సివిల్ సప్లయీస్ కమిషనర్ అరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి సివిల్ సప్లయీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్డుదారులకు నాణ్యమైన బియ్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పక్కాగా అందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ శోభారాణి, సివిల్ సప్లయీస్ ఇన్‌చార్జ్ డీఎం నీలమయ్య, విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతలో జాగ్రత్తలు పాటించండి: కలెక్టర్


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) భద్రతలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. అనంతపురంలోని ఆర్‌డీఓ పాత కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను శనివారం ఆమె పరిశీలించారు. ఈవీఎంలతో పాటు వీవీప్యాట్‌లు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రికి చేపట్టిన భద్రతా చర్యలను అడిగి తెలుసుకున్నారు. గోదాము వద్ద సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటీపీ) ఆఫ్ ఈవీఎంలో భాగంగా బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజనీర్లు ఈవీఎంలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్‌డీఓ మధుసూదన్, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెన్నైకు రెండు ఏసీ బస్సులు

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రం నుంచి తిరుపతి మీదుగా చెన్నైకు ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రెండు ఏసీ బస్సులు నడపనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని శనివారం ఓ ప్రకటన జారీ చేశారు. రోజు రాత్రి 9.30 గంటలకు (సర్వీస్ నెంబర్ 6616) అనంతపురం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. తిరిగి చెన్నై నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు అనంతపురానికి చేరుకుంటుంది. పెద్దలకు రూ. 950, పిల్లలకు రూ.740 చొప్పున ఛార్జీ వసూలు చేస్తారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంది.

గంజాయి ముఠా అరెస్ట్

- 18 మంది అరెస్ట్
- 21 కిలోలు గంజాయి, 18 సెల్ ఫోన్‌లు, 2 ఆటోలు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: గంజాయిని పెద్ద ఎత్తున అనంతకు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్న ముఠా సభ్యులను పోలీసులు వేర్వేరుగా అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు.

- అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన పి.జాఫర్‌ఖాన్ అలియాస్ గోరా, ప్రశాంతి నగర్ నివాసి కొలిమి షబ్బీర్, భవానీనగర్‌కు చెందిన కొలిమి మహమ్మద్‌నజీర్, టి.ఎన్ నవీన్‌కుమార్ అలియాస్ అలియాస్ కోడి, రంగస్వామినగర్ నివాసి జి.లోకేష్, జనశక్తినగర్ చెందిన టి.షెక్షావలి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం పాత మల్లవరం నివాసి కె.సత్యనారాయణ పట్టుబడ్డారు. వీరి నుంచి 11 కిలోల గంజాయి, 9 సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు జాఫర్‌ఖాన్ విశాఖ ఏజెన్సీ ప్రాంతాల్లో కిలో గంజాయిని రూ.4 నుంచి రూ.5 వేలతో కొనుగోలు చేసి, అనంతకు దిగుమతి చేసుకుని నవీన్, సత్యనారాయణ, లోకేష్, జావేద్, నక్కాన వీన్, షెక్షావలీ ద్వారా పొట్లాలుగా కట్టించి కిలో రూ.15 వేలతో రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో పలువురు విద్యార్థులకు విక్రయించేవారు. అందిన పక్కా సమాచారంతో చెరువుకట్ట సుంకులమ్మ ఆలయ సమీపంలో తచ్చాడుతున్న ముఠా సభ్యులను వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప అరెస్ట్ చేశారు.
- నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తపోవనానికి చెందిన కోయలదిన్నె పవన్ కుమార్, బోయ వంశీకృష్ణ అలియాస్ వంశి, సోమనాథ్ నగర్‌కు చెందిన పయ్యావుల లోకనాథనాయుడు అలియాస్ నైన్టీ గాడు, సయ్యద్‌ఖాజా హుస్సేన్, నగరంలోని బళ్లారి బైపాస్ ప్రాంతానికి చెందిన గాండ్ల భరత్‌కుమార్, ఎ.నారాయణపురం నివాసి సాకే తిమోతి, మూడో రోడ్డు నివాసి గాజుల దిలీప్, డీమార్టు వెనుక వైపు నివాసముంటున్న చిన్న పరెడ్డిగారి హేమసాయిరెడ్డి, పాపంపేట నివాసి రెప్పల అజీజ్ పట్టుబడ్డారు. వీరి నుంచి 10 కిలోల గంజాయి, 9 సెల్‌ఫోన్లు, రెండు ఆటోలు, రెండు స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో పవన్‌కుమార్, లోకనాథ్‌నాయుడుకు కిలో రూ.6 వేల చొప్పున గంజాయిని రాణినగర్‌కు చెందిన జాఫర్ సరఫరా చేసేవాడు. వీరిద్దరూ పొట్లాలు కట్టి కిలో రూ.10 వేల చొప్పున గాండ్ల భరత్‌కుమార్, సయ్యద్‌ఖాజాహుస్సేన్, సాకే తిమోతి, వంశి, దిలీప్, హేమసాయిరెడ్డి, అజీజ్‌కు అందజేసేవారు. వీరి కదలికలపై నిఘా ఉంచిన నాల్గో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి.... పక్కా ఆధారాలతో తపోవనం కూడలిలో అరెస్ట్ చేశారు. గతంలో ఈ రెండు ముఠాలు రాణినగరులో గొడవపడ్డాయి. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తుండగా గంజాయి అంశం గుట్టురట్టయింది.

ప్రధాన నిందితుడు జాఫర్‌ఖాన్ (రాణినగర్)పై ఇప్పటికే చాలా కేసులున్నాయని, ఈ నేపథ్యంలో అతనిపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని గంజాయిని విక్రయిస్తున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారన్నారు. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసిన 101 మంది విద్యార్థులను గుర్తించామని, వీరిని డీఅడిక్షన్ సెంటర్‌లో చేర్పించి చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఏడు నిమిషాల వ్యవధిలో 'దిశ' రక్షణ

పుట్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దిశ రక్షణ వ్యవస్థ నిమిషాల వ్యవధిలోనే ఓ కుటుంబాన్ని దాడి బారి నుంచి కాపాడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలు... స్థల వివాదం నేపథ్యంలో శుక్రవారం పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కొండారెడ్డి, రత్నమ్మ, లక్ష్మిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత సాంబశివారెడ్డితో పాటు మరో ఏడుగురు దాడికి తెగబడిన విషయం తెలిసిందే. దౌర్జన్యంగా వారందరూ ఇంట్లోకి చొరబడి దాడి చేస్తున్న సమయంలో మహిళలు దిశ యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కారు. సమాచారం అందుకున్న పోలీసులు కేవలం ఏడు నిమిషాల వ్యవధిలోనే అక్కడకు చేరుకుని బాధితులకు రక్షణగా నిలిచారు. అప్పటికే గాయపడిన లక్ష్మి, కొండారెడ్డి, రత్నమ్మను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంబ శివారెడ్డి, తిప్పారెడ్డితో పాటు మరో ఆరుగురిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హుండీలో నగదు అపహరణపై విచారణ

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇటీవల చోటు చేసుకున్న హుండీలో నగదు అపహరణ ఘటనపై దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ విజయ్‌సాగర్‌బాబు, కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ శనివారం విచారణ చేపట్టారు. చోరీ జరిగిన హుండీని, సీసీ ఫుటేజీలను కమిటీ సభ్యులు పరిశీలించారు. తర్వాత ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డి, ఏఈఓ ధనుంజయ, ఇతర సిబ్బందిని విచారించారు.

ఔను అది హత్యే!

- హెచ్చెల్సీలో కొట్టుకు వచ్చిన మృతదేహం ఆచూకీ లభ్యం
- హతుడిని బళ్లారి వాసిగా గుర్తించిన పోలీసులు
- వివాహేతర సంబంధం కారణంగానే హత్య?


వినోజ్ (ఫైల్)

బొమ్మనహాళ్: హెచ్చెల్సీలో కొట్టుకు వచ్చిన మృతదేహం ఆచూకీ లభ్యమైంది. యువకుడిని హత్య చేసి, కాళ్లుచేతులు కట్టేసి హెచ్చెల్సీలో పడేసినట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు శివారులోని హెచ్చెల్సీ 119/500 కిలోమీటర్ వద్ద శుక్రవారం ఓ యువకుడి మృతదేహం కొట్టుకు వచ్చిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్, ఎస్ఐ శివ... శనివారం ఉదయం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. హత్య చేసి కాళ్లు, చేతులు తాడుతో కట్టేసి హెచ్చెల్సీ ప్రధాన కాలువలో పడేసినట్లుగా నిర్ధారించారు. లభ్యమైన ఆధారాలను బట్టి హతుడిని బళ్లారిలోని మేదార్ కేతయ్య నగర్ (ఎమ్‌కే నగర్)కు చెందిన ఎం.వినోజ్ (30)గా గుర్తించారు. సండూరు వద్ద ఎస్‌ఎండీసీ కంపెనీలో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తుండేవాడు. వివాహేతర సంబంధాల కారణంగానే హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. వీఆర్వో కుళ్లాయి స్వామి నుంచి స్వీకరించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ అమలు భేష్

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ


సరోజమ్మను సన్మానిస్తున్న ఐఎంఏ వైద్యబృందం

గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలు చాలా బాగుందని, ఈ పథకం పరిధిని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోరంజన్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కీర్తికిరణ్‌రెడ్డితో కలసి శనివారం సాయంత్రం గుంతకల్లు ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల జబ్బులను ఆరోగ్యశ్రీ పథకం కింద చేర్చడంతో పాటు 20 పడకల వసతి కలిగిన ఆస్పత్రులకు సైతం వర్తింపజేస్తే గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందుతాయన్నారు. వైద్యులపై భౌతిక దాడులు చోటు చేసుకోకుండా కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సరైన అర్హత, శిక్షణ లేకుండా గ్రామీణ వైద్యులు శక్తివంతమైన యాంటీబయాటిక్ మందులను ఎక్కువగా ఇవ్వడం వల్ల రోగులు తీవ్రమైన జబ్బుల బారిన పడి ఇతర మందులు పని చేయని స్థితి దాపురిస్తోందని, ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు స్థాయికి మించి వైద్యం అందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గుంతకల్లులో మూడు దశాబ్దాలుగా విశిష్ట వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సరోజమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ గుంతకల్లు శాఖ కార్యదర్శి డాక్టర్ జిలాన్, వైద్యులు శ్రీకాంతరెడ్డి, శ్రీనివాసగుప్తా, జయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీ విజయపరంపర


విజయోత్సవంలో ఏపీ క్రీడాకారులు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సబ్ జూనియర్ బాలుర నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో ఏపీ జట్టు విజయ పరంపరను కొనసాగిస్తోంది. శనివారం లక్షద్వీప్‌తో తలపడిన ఏపీ జట్టు 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. జట్టులో సాత్విక్, సాదిక్ వలి, కియాన్స్ చెరో గోల్ సాధించారు. హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడిన సిక్కిం జట్టు 3–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. త్రిపురపై ఏకంగా 11 గోల్స్‌తో బిహార్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈ మ్యాచ్‌లో త్రిపుర జట్టు ఒక్క గోల్ కూడా సాధించలేకపోయింది. అలాగే అండమాన్‌నికోబార్‌పై 9–0 గోల్స్ తేడాతో ఉత్తరాఖండ్ జట్టు విజయం సాధించింది.

రంగస్థల కళాకారులకు గుర్తింపు కార్డులు

అనంతపురం అర్బన్: జిల్లాలోని రంగస్థల కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను జారీ చేయనుంది. ఈ మేరకు జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి పి.గురుస్వామిశెట్టి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారు ప్రభుత్వం సూచించిన ప్రొఫార్మా మేరకు వివరాలను దరఖాస్తులో పొందుపరిచి ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అనంతపురంలోని రైతు బజార్ సమీపంలో ఉన్న జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు సంబంధిత ఆధారాల నకలు ప్రతులు తప్పనిసరిగా జత చేయాలి.

బీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో బీఈడీ (దూరవిద్య) రెండో సంవత్సరం ఫలితాలు శనివారం ఆ వర్సిటీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 338 మంది పరీక్ష రాయగా 325 (96.15 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 21వ తేదీ వరకూ గడువునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, దూరవిద్య డైరెక్టర్ మునినారాయణప్ప, కోఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్ రావు, ప్రొఫెసర్ వి.రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్, సీడీసీ డీన్ రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు కేంద్రం మేనేజర్ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతకు యాంబర్ ప్రాజెక్టు కింద కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ సేల్స్ అసోసియేట్స్, జాబ్‌రోల్స్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ, సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తి వివరాలకు అనంతపురంలోని రాజురోడ్డులో ఉన్న ఎక్సల్స్ లర్నింగ్ సొల్యూషన్ కార్యాలయంలో నేరుగా లేదా 93981 54460, 75696 59964లో సంప్రదించవచ్చు.

రైతాంగాన్ని ఆదుకుందాం


పొట్టేళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, తదితరులు

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గంలోని రైతాంగాన్ని ఆదుకుందామంటూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. బీకేఎస్ మండలం సిద్దరాంపురంలోని వేంకటేశ్వర పశు పరిశోధనా కేంద్రంలో ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద గిరిజనులకు శనివారం పొట్టేళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిశోధనా కేంద్రం సంచాలకులు డాక్టర్ సజ్జనరావుతో కలసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ... రాయితీతో ప్రభుత్వం అందజేస్తున్న విత్తన పొట్టేళ్లు, గొర్రెల ద్వారా మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నాగులగుడ్డం తండాకు చెందిన 30 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు చొప్పున నెల్లూరు బ్రౌన్ రకం పొట్టేళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ కొండన్న, పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసనాయక్, పలమనేరు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వేణు, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ పద్మనాభం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, నాయకులు ఆలూరి రమణారెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ, ఆగ్రోస్ రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు

ఎస్వీవీయూ పాలక మండలి సభ్యురాలిగా ఎమ్మెల్యే పద్మావతి

తిరుపతిలో ఉన్న శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ (ఎస్వీవీయూ) పాలక మండలి సభ్యురాలిగా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నియమితులయ్యారు. ఈ మేరకు సిద్దరాంపురం పశు వైద్య పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ శనివారం వెల్లడించారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆమె కొనసాగనున్నారు.



క్లుప్తంగా

జడ్జి మన్మధరావును కలిసిన కలెక్టర్



జడ్జి మన్మధరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురం అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె. మన్మధరావుకు జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి స్వాగతం పలికారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన జడ్జి మన్మధరావును స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా కలెక్టర్ ఎం. గౌతమి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. అలాగే జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ న్యాయమూర్తి మన్మధరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

హాకీ పోటీలకు సనప విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ నాగరాజు

ఆత్మకూరు: మండలంలోని సనప జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్ -19 హాకీ క్రీడలకు ఎంపికైనట్లు పీడీ నాగరాజు శనివారం తెలిపారు. పీడీ మాట్లాడుతూ గత నెల 29న ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-19 జిల్లా స్థాయి క్రీడల్లో విద్యార్థులు రేవంత్‌రెడ్డి, రాజు, తరుష్, నందకుమార్‌రెడ్డి, శిరీష, తేజ, నవనీత, సాయి కీర్తన ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 లో కూడి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో చిత్తూరు జిల్లాలో జరగబోవు హాకీ క్రీడల్లో వీరు పాల్గొంటున్నట్లు తెలిపారు.

2న అనంతలో రాష్ట్ర సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తవుతున్నా పునర్విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు కాలేదని సీపీఎం జిల్లా కమిటీ విమర్శించింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 2న అనంతపురంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులతో కలిసి రాంభూపాల్ రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ సదస్సులో వామపక్ష పార్టీలు, మానవ హక్కుల వేదిక నాయకులు పాల్గొంటారన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అనంతపురం కల్చరల్: చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ కళావేదిక ప్రీవ్యూ థియేటర్‌లో సమాచార హక్కు చట్టంపై చర్చా వేదిక జరిగింది. శిక్షణ తరగతులకు హొన్నూరప్ప అధ్యక్షత వహించారు. వివిధ సంస్థల ప్రతినిధులు కేపీ రాజు, కంబదూరు షేక్ నబీరసూల్, హరికృష్ణయాదవ్, షౌకత్‌అలీ, దర్శకుడు రషీద్, తదితరులు ప్రసంగించారు. అనంతరం ఇటీవల బోయిభీమన్న, గురజాడ అప్పారావు అవార్డులు అందుకున్న నబీరసూల్, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కేపీ రాజును సభ్యులు సత్కరించారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు

అనంతపురం: విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ' స్వచ్ఛతా హీ సేవా ' ప్రచారంలో ఈనెల 2 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంపై అవగాహన, సామాజిక సేవా దృక్పథం అలవర్చుకునేందుకు జాతీయ సేవా పథకం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ జి.మమత , ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



బుద్ధప్పనగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ తలారి రంగయ్య



వైద్య శిబిరంలో చిన్నారి సౌమ్యకు చేస్తున్న వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని బుద్ధప్పనగర్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. మొదట ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను వారు పరిశీలించారు. ప్రజలకు అందించిన టోకన్ ద్వారా కేసుషీట్‌ను ఏవిధంగా నమోదు చేసి, వైద్యులకు రెఫర్ చేస్తున్నారనే అంశాన్ని పరిశీలించారు. ప్రజల సమస్యలు గుర్తించి సంబంధిత ఆస్పత్రికి పంపేలా చర్యలు తీసుకోవాలని స్పెషలిస్టు వైద్యులు, యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సారికకు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ షుగర్, బీపీ పరీక్షలు చేసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 64 రకాల రక్తపరీక్షలు..

ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రులకు వెళ్లకుండా పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 64 రకాల రక్తపరీక్షలు, 172 రకాల మందులు ప్రభుత్వం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుందన్నారు. ప్రైవేట్‌గా ఆస్పత్రిలో చూపించుకోవాలంటే ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. నియోజకవర్గంలో మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు అంగన్‌వాడీ సెంటర్లు, ప్లే స్కూళ్లకు వెళ్తున్నారో విచారణ చేపట్టాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సాహసోపేతమైనదన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య సేవలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నియోజకవర్గంలో 21 క్యాంపులు జరగనున్నట్లు తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి, ఆరోగ్యశ్రీని పటిష్టం చేసి, ఏకంగా 3,256 వ్యాధులకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఐదు దశల్లో స్క్రీనింగ్ నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రులు, నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపుతున్నట్లు తెలిపారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని పట్టించుకోలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం స్కాంలు చేస్తే..వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం స్కీంలు తీసుకువచ్చి ప్రజలు ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు లీలావతి, సైఫుల్లాబేగ్, సంపంగి రామాంజనేయులు, బాబా, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు తరలివచ్చిన ప్రజలు



ఆత్మకూరులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి స్పందనలభించింది. శనివారం 352 మందికి వైద్య సిబ్బంది చికిత్సలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, ఎంపీపీ హేమలత, డాక్టర్ దయాకర్, సర్పంచ్‌లు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, గోపాల్‌రెడ్డి, అతిక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు 'డీసీసీబీ' రుణవితరణ



మెగా చెక్కు అందిస్తున్న ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత, డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా విరివిగా రుణాలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. అనంతపురంలోని రామ్‌నగర్‌శాఖ తరపున 10 మహిళా సంఘాలకు సంబంధించి రూ.ఒక కోటి రుణం మంజూరుకు సంబంధించిన మెగా చెక్కును శనివారం స్థానిక డీసీసీబీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అందజేసి, మాట్లాడారు. ఒక్కో సంఘానికి ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా గరిష్టంగా రూ.20 లక్షల మేర రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ డీసీసీబీ ద్వారా రూ.110 కోట్లు ఇవ్వగా... ఇందులో రామ్‌నగర్ శాఖ ద్వారా రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర అన్ని వర్గాలకు విశేష సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్ వై.జనార్దన్‌రెడ్డి, సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎం సుఖదేవబాబు, ఏజీఎం ప్రసన్నలక్ష్మి, రామ్‌నగర్‌శాఖ మేనేజర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేర సమాచారం

దాబాల్లో పోలీసుల దాడులు

అనంతపురం క్రైం: జిల్లా వ్యాప్తంగా అనంత పోలీసులు హోటళ్లు, దాబాల్లో మద్యం తాగే వారిపై చర్యలకు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయాలు, అనుమతిలేని ప్రాంతాల్లో మద్యం సేవించేవారిని అదుపులోకి తీసుకున్నారు.

లాడ్జీల్లో తనిఖీలు: జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి పోలీసలు ఆయా స్టేషన్ల పరిధిలోని ప్రతి లాడ్జినీ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. లాడ్జిలకు వచ్చే వారి వివరాలు తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ఆధార్ కార్డులు చూసి గదులు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఫ్లోర్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనుమానితులుగా భావిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు: కట్టుకున్న భర్త ఇబ్బంది పెడుతున్నాడని భువనేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నార్పల మండల కేంద్రానికి చెందిన తిరుపతినాయుడు తనను సరిగా చూసుకోలేదని భార్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ధరణీకిశోర్ తెలిపారు. దంపతులను సఖీ సెంటర్‌కు కౌన్సెలింగ్ నిమిత్తం పంపుతామన్నారు.

యువకుడు అదృశ్యం: గుమ్మగట్ట మండలం, గోనబావికి చెందిన చెందిన ద్యానేష్ కనిపించలేదని యువకుడి తండ్రి పామిరెడ్డి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం గ్రామం నుంచి కుమారుడిని ఆకుతోటపల్లి సమీపంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో వదిలేందుకు కుమారుడితో కలసి వచ్చిన తండ్రి..ఆర్టీసీ బస్టాండులో బాత్‌రూముకు వెళ్లి వచ్చేలోపు ద్యానేష్ కనిపించకుండా పోయాడు. అతని కోసం గాలించిన తండ్రికి ఆచూకీ తెలియరాలేదు. యువకుడి తండ్రి శనివారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు.


ఐటీఐ అర్హతతో విరివిగా ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఉపాధి కల్పన అధికారి కళ్యాణి

అనంతపురం ఎడ్యుకేషన్: ఐటీఐ అర్హతతో ఉపాధి అవకాశాలు విరివిగా లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి తెలిపారు. శనివారం నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న శ్రీసాయి వెంకటేశ్వర ఐటీఐలో 'స్నాతకోత్సవం' ఏర్పాటు చేశారు. జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాట్లాడుతూ డాక్‌యార్డ్, హెచ్ఏఎల్, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ సర్టిఫికెట్ పొందిన అనంతరం అభ్యర్థులు అప్రెంటిషిప్ చేయాలన్నారు. అప్రెంటిషిప్, ప్లేస్‌మెంట్ కోసం ప్రభుత్వ ఐటీఐలో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సాయి వెంకటేశ్వర ఐటీఐ ప్రిన్సిపాల్ సుధాకర్, డైరెక్టర్ భారతి, కోఆర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.

రైతు బిడ్డను వరించిన జడ్జి ఉద్యోగం



మమతారెడ్డి

అనంతపురం: గార్లదిన్నె మండలం రామదాసుపేటకు చెందిన సర్వేశ్వరరెడ్డి, మహాలక్ష్మి దంపతుల కుమార్తె మమతారెడ్డి... జడ్జి పోస్టుకు అర్హత సాధించారు. జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగానికి సంబంధించి నిర్వహించిన పరీక్షల్లో ఈ ఏడాది మార్చిలో ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 32వ ర్యాంక్‌ను మమతారెడ్డి దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు తెలంగాణలోని నాగర్‌కర్నూలులో జూనియర్ సివిల్ జడ్జిగా పోస్టింగ్ కల్పించారు. కాగా, అనంతపురంలోనే ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న ఆమె ఎస్కేయూ క్యాంపస్‌లోని పీజీ కళాశాలలో ఎల్ఎల్ఎం చదివారు. సీనియర్ న్యాయవాది కేఎల్ఎస్ ప్రసాద్ వద్ద జూనియర్‌గా పనిచేస్తూనే జడ్జి ఉద్యోగ ఎంపిక పరీక్షకు సన్నద్ధమయ్యారు. తల్లిదండ్రులతో పాటు భర్త తరుణ్‌కుమార్‌రెడ్డి, అత్త, మామ సహకారంతోనే నేడు ఈ స్థానానికి తాను చేరుకున్నట్లుగా 'సాక్షి'తో ఆమె సగర్వంగా పేర్కొన్నారు. పుస్తకాలు సైతం కొనుక్కోలేని నిరుపేద విద్యార్థులకు తన మొదటి జీతాన్ని అందజేస్తున్నట్లు వివరించారు.

ఉద్యమాలను అపహాస్యం చేస్తున్న టీడీపీ

- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిన చంద్రబాబును న్యాయస్థానం రిమాండ్‌కు పంపితే, న్యాయమూర్తి తీర్పును తప్పుపట్టేలా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక నేరస్తుడైన చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రాస్తారోకోలు, హర్తాళ్లు, కొవ్వొత్తులతో ర్యాలీలు, తప్పట్లు అంటూ టీడీపీ నాయకులు కార్యక్రమాలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై ధర్నాలు, వివిధ రూపాల్లో తెలియజేస్తారన్నారు. స్కిల్ స్కాంలో రూ.371 కోట్ల అక్రమాలపై న్యాయస్థానం చంద్రబాబును రిమాండ్ విధించిందన్నారు. రిమాండ్ ఖైదీల కోసం ఉద్యమాలు చేసిన చరిత్ర టీడీపీదని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీకి న్యాయవ్యవస్థపై గౌరవం లేదన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు తనయుడు లోకేష్ జైలుకు వెళ్లడం తథ్యమన్నారు.

పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం



కూతురు, కుమారుడితో తల్లి అన్నపూర్ణ (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పిల్లిగుండ్ల కాలనీకి చెందిన రమావత్ అన్నపూర్ణ అనే వివాహిత తన పిల్లలతో కలిసి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. కుమార్ నాయక్, రమావత్ అన్నపూర్ణ దంపతులు పిల్లిగుండ్ల కాలనీ సమీపంలో నివాసం ఉంటున్నారు.వీరికి రమావత్ శ్రీనిధి, రమావత్ శ్రీత్విక్ సంతానం. కుమార్‌నాయక్ హోటల్‌లో వంటమాస్టర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసైన కుమార్‌నాయక్.. తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. దీంతో ఇద్దరి మధ్యా మనస్పర్ధలున్నాయి. అన్నపూర్ణ మహాలయ పౌర్ణమికి తండ్రి గోపాల్‌నాయక్ ఇంటికి పిల్లలను తీసుకొని వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకుంది. ఆ సమయంలో భార్యభర్తలిద్దరూ గొడవపడ్డారు. అనంతరం కుమార్‌నాయక్ ఇంటి నుంచి సోదరుడి ఇంటికి వెళ్లిపోయి, ఇంటికి వెళ్లలేదు. శనివారం ఉదయం గోపాల్‌నాయక్ తన కూతురి ఇంటికి వెళ్లి చూడగా, తాళం వేసి ఉంది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లవద్ద వెళ్లి ఆరాతీసినా ఆచూకీలేదు. కుమార్‌నాయక్ తన సోదరుడి ఇంటివద్ద ఉన్నాడు. అన్నపూర్ణ తండ్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

బీమా తక్షణసాయం అందజేత

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కామారుపల్లికి చెందిన చాకలి గోపి సాధారణ మృతి చెందారు. వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మృతుడి భార్య చాకలి నాగలక్ష్మికి సర్పంచ్ మూలి లక్ష్మీకళ చేతుల మీదుగా శనివారం రూ. 10 వేలు అందజేశా రు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ఎన్‌సీసీ ఎంపికలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 6వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. 2023 అడ్మిషన్లలో కొత్తగా వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థుల్లో 52 మంది హాజరు కాగా, వారిలో 26 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా 6వ ఆంధ్రా బెటాలియన్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులందరూ క్రమశిక్షణతో కార్యక్రమాల్లో పాల్గొని 'బి' సర్టిఫికెట్ పొందాలన్నారు. 'సి' సర్టిఫికెట్ పొందిన వారికి ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉంటుందన్నారు.ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, సీటీఓ జగదీష్ పాల్గొన్నారు.

నేడు ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం

అనంతపురం కల్చరల్: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఈనెల 1న ఉదయం 9 గంటలకు స్థానిక వేమన ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు.

'ఎస్ఎస్‌బీఎన్'లో రక్తదాన శిబిరం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను తెలియజేశారు. కార్యదర్శి డాక్టర్ కే నిర్మలమ్మ , కళాశాల అధ్యక్షులు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్, అనంతపురం మెడికల్ ఆఫీసర్ బి. జనార్దన్ నాయక్, నర్సింగ్ ఆఫీసర్ సురేష్, పవన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. రమాదేవి పాల్గొన్నారు.

నేడు స్వయం సేవక్ సమతా సమ్మేళనం

అనంతపురం కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి కల్యాణ మంటపంలో ఆదివారం రాయలసీమ స్థాయి సమతా సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు రేనాటి నాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయ సామగ్రి అపహరణతో బెంబేలు

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామంలో నెల రోజుల్లోనే ఆరు స్టార్టర్ పెట్టెలు అపహరణకు గురయ్యాయి. ఆత్మకూరులో ముగ్గురు రైతులకు చెందిన స్టార్టర్లను ఎత్తుకెళ్లారు. ఆత్మకూరుకు చెందిన నవీంద్రారెడ్డి అనే రైతుకు చెందిన తోటలో ఇరవైరోజుల క్రితం స్టార్టర్ పెట్టె ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం70 మీటర్ల కేబుల్ ఎత్తుకెళ్లారు.

కారు అద్దెకు తీసుకొని పరారీ

అనంతపురం క్రైం: తెలంగాణ రాష్ట్రం చిలుపూర్ మండల కేంద్రానికి చెందిన అనిత అనే మహిళ నుంచి షిఫ్ట్ డిజైర్ కారు అద్దెకు తీసుకొని పరారైన అనంత వాసి కోసం బాధితులు గాలిస్తున్నారు. 8 నెలలు కావస్తున్నా కారు కనిపించలేదని బాధితులు వాపోయారు. శనివారం స్థానిక త్రీటౌన్ పోలీసులను కలిసి ఆర్‌కేనగర్‌కు చెందిన బాలాజీ

సంక్షిప్త సమాచారం

అనే వ్యక్తి నెలవారి అద్దెకు కారు తీసుకొని కనిపించకుండా, అద్దె చెల్లించకుండా తిరుగుతున్నాడని ఫిర్యాదు చేశారు. అతని వివరాలు ఆరా తీస్తే అనంతపురంలోని ఆర్‌కేనగర్‌గా తెలిసిందన్నారు. ఓటరు కార్డులోని వివరాలను పోలీసులకు వారు చూపించారు. పోలీసులు స్పందించి వారు చెప్పిన చిరునామాలో సదరు వ్యక్తి లేదని తెలుసుకున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం

రాప్తాడు: వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అనంతపురం రూరల్ మండల ఎంఈఓ వెంకట స్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ (వ్యాయామ విద్య) సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు నరసింహులు, కాంప్లెక్స్ కోఆర్డినేటర్లు రాజశేఖర్ రెడ్డి, కేశవ మూర్తి, పీడీలు సునీత, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి ఎంపీపీ సుజాత రాజీనామా

రాప్తాడురూరల్: రామగిరి ఎంపీపీ ఎనమల సుజాత తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం అనంతపురంలో జాయింట్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ కేతన్‌గార్గ్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని అందించారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశానని, ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగతానని సుజాత స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీ కోసం ధర్నా

అనంతపురం అర్బన్: మెగా డీఎస్సీ చేపట్టి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని విద్యార్థి రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నాయకులు, విద్యార్థులు శనివారం ధర్నా చేశారు. అనంతరం డీఆర్ఓ గాయత్రి దేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు టీపీ రామన్న,నాయకులు జయరాములు, సాయిగోపాల్, సాయి విక్రమ్, నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



ఎమ్మెల్యే అనంతను సన్మానిస్తున్న కొండ్రెడ్డి ఓబిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అనంతపురం అర్బన్ క్లస్టర్- 2 అధ్యక్షుడిగా నియమితులైన కొండ్రెడ్డి ఓబిరెడ్డి ఎమ్మెల్యేను ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, లీలావతి, సాకే చంద్ర, కమల్‌భూషణ్, నరసింహులు, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన బ్రిడ్జి నిర్మించండి

అనంతపురం రూరల్: రుద్రంపేట ఆలమూరు రోడ్డులో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం ఇంజినీరింగ్ అధికారులు, సర్పంచ్ పద్మావతితో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణనాయక్ పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ



ర్యాలీని ప్రారంభిస్తున్న సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ ప్రసాదించినట్లవుతుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం నేషనల్ హెల్త్ స్కీం 'జాతీయ సేవా భవ' పిలుపు మేరకు వైద్య కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో అవయవదానంపై వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం అవగాహన ర్యాలీని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ శంకర్ నాయక్, ఎస్పీఎం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని కాపాడాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

రాప్తాడురూరల్: దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని వక్తలు పేర్కొన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 'మేరా మాటీ-మేరా దేశ్' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ తాళంకి వెంకట అపర్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు మట్టిని సేకరించి కలశంలో ఉంచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కేశవ రెడ్డి, సచివాయల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంజీ కార్ల బుకింగ్ ప్రారంభం



అనంతపురంలో ఎంజీ కార్స్ షోరూం

తిరుపతి కల్చరల్: వందేళ్ల అనుభవం, చరిత్ర కలిగిన ఎంజీ కార్లు ఇప్పుడు అనంతపురం ప్రజల కోసం స్థానిక అనంతపురం- బెంగళూరు హైవేలో అందుబాటులోకి తెచ్చామని క్వెస్ ఆటో మోటార్స్ అధినేత ఉదయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఫ్యూచర్స్, టెక్నాలజీ కలిగిన ఎంజీ ఆస్టర్, మెక్టార్, గ్లోస్టర్‌తో పాటు విద్యుత్ వాహనాల బుకింగ్స్, టెస్ట్ డ్రైవ్ ప్రారంభమైనట్లు తెలిపారు. ఎంజీ సంస్థ 100 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్టు తెలియజేశారు. వివరాలకు షోరూంలోగానీ సెల్: 9912976666లోగానీ సంప్రదించాలన్నారు.